సిబ్బంది నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో ఖాళీల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. పిజిటి బయాలజీ 1 పోస్టుకు జీవశాస్త్రంలో ఎంఎస్‌సి, బిఇడి, టిజిటి ఆర్ట్ 1 పోస్టుకు ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, కౌన్సెలర్ 1 పోస్టుకు సైకాలజీలో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని అన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తును సంబంధిత అర్హత సర్టిఫికెట్లతో పాటు అక్టోబర్ 7 లోపు పాఠశాల కార్యాలయంలో స్వయంగా సమర్పించాలని అన్నారు. పత్రాల ధ్రువీకరణ తర్వాత, అర్హత కలిగిన అభ్యర్థులను రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు.

పర్యవేక్షణా లోపం...విద్యార్థులకు శాపం

చికిత్స పొందుతూ మరో విద్యార్థిని మృతి

గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలపై శ్రద్ధ చూపేదెవరు?

వరుస సంఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన

ఏజెన్సీలోరి గిరిజన సంక్షేమ, గురుకుల ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో అధికారుల పర్యవేక్షణా లోపం విద్యార్థులకు శాపం మారింది. ఏ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాన్ని తొంగి చూసినా విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యంగా మెనూ అమలు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు.. ఇలా అన్నీ అంతుచిక్కని సమస్యలే.. సకాలంలో వైద్యమందక మరణాలు సంభవిస్తున్న ఘటనలు కోకొల్లలు. ముఖ్యంగా బాలికా సంరక్షణ ఇంకా ప్రశ్నార్థకం. నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు చేపట్టడంలో విఫలం, ప్రభుత్వం పౌష్టికాహారం అందించక వందలాది మంది విద్యార్థులు రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. దీంతో ఆడుతూ పాడుతూ చదవాల్సిన చిన్నారులు మొగ్గలోనే రాలిపోతున్నారు. తమ బిడ్డలను ఉన్నత చదువు చదివించి మంచి స్థాయిలో చూడాలనుకుంటున్న తల్లిదండ్రుల ఆశలు ఆవిరవుతున్నాయి. తమ బిడ్డ బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలలు, వసతి గృహాలకు పంపిస్తున్న తల్లిదండ్రులకు కడుపుకోత తప్పడం లేదు. తరచూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడంతో అధికారుల పర్యవేక్షణపై సందేహాలు వస్తున్నాయి.

మృతి చెందిన కల్పన (ఫైల్)

ప్రజాశక్తి-కురుపాం

స్థానిక గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ దండుసూరకు చెందిన విద్యార్థిని తోయక కల్పన విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఇదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గుమ్మలక్ష్మీపురం మండలం కంభగూడ గ్రామనికి చెందిన పువ్వల అంజలి అనారోగ్యంతో బాధపడుతూ గత గురువారం రాత్రి మృతి చెందింది. వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థినిలు మృతి చెందడం ఆందోళనకు గురిచేసింది. అలాగే మరో 15 మంది విద్యార్థినిలు దసరా సెలవులు ముందు నుంచే అనారోగ్యం బారిన పడి సెలవుల కు ఇంటికి చేరిన ఒక్కొక్క విద్యార్థి చినమేరంగి, కురుపాం, మొండెఖల్, పార్వతీపురం, విశాఖ కెజిహెచ్ తదితర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే సెలవులకు ముందు నుంచి విద్యార్థినులు అనారోగ్యం బారినపడినప్పటికీ పాఠశాల సిబ్బంది సమాచారం ఇవ్వలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

పౌష్టికాహార లోపం, రక్తహీనత

ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు పౌష్టికాహారం లోపం కారణంగా రక్తహీనతకు గురై వ్యాధుల బారిన పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ సమస్య ఉన్నా అధికారులు విద్యార్థుల ఆరోగ్య క్షేమాలపై దృష్టి సారించలేదు. దీంతో తరచూ మరణాల జరుగుతున్నాయని గిరిజన సంఘాల నాయకులు అంటున్నారు. విద్యార్థులకు వారం వారం అధికారులు ఆరోగ్య పరీక్షలు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాలా మంది విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం కారణంగా రక్తహీనత కనిపిస్తోంది. దీనికి తోడు జ్వరం, కడుపు నొప్పి కారణంగా విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. గతంలో ఎక్కువ శాతం మంది విద్యార్థులు రక్తహీనత కారణంగా మృత్యువాత పడిన సంఘటన ఉన్నాయి. ఆశ్రమ పాఠశాలలో పౌష్టికాహారం విద్యార్థులకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత ఐటిడిఎ అధికారులపై ఉంది. అయితే వసతిగృహాలపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉద్యమాలు చేస్తానే ఉన్నాయి. అనారోగ్యానికి గురవుతున్న విద్యార్థులు మండల కేంద్రానికి, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వస్తున్నారు. పాఠశాల సమయంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రులకు రావడంతో తరగతులకు దూరం కావాల్సి వస్తోంది. అటు వైద్యం అందక, ఇటు చదువు లేక చివరికి ఇంటి బాట పట్టాల్సిన పరిస్థితి వస్తుంది.

విద్యార్థుల మరణాలతోనైనా మేల్కొంటారా?

మన్యం జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలతోనైనా ప్రభుత్వం, అధికారులు మేల్కొంటారా?, ఆరోగ్య కార్యకర్తలను నియమించి స్థానికంగా విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తారా? రక్తహీనత చర్యలు చేపడతారు? వరుస ప్రశ్నలు విద్యార్థి సంఘాల నుంచి వినిపిస్తున్నాయి. వీటిపై ప్రభుత్వం ఏ రకమైన చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

విద్యార్థులను పరామర్శించిన మాజీ డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణి

ఎపి గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అనారోగ్యం పాలై స్థానిక సిహెచ్‌సిలో పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల శ్రీవాణి బుధవారం సాయంత్రం ఆసుపత్రికి వద్దకు వెళ్లి విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులతో మాట్లాడి వారికి మెరుగైన వైద్యమందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల వద్దకు వెళ్లి ప్రిన్సిపల్ అనురాధతో మాట్లాడి మొత్తం ఎంతమంది విద్యార్థులు ఎలా అనారోగ్యం పాలయ్యారు, అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్, రాష్ట్ర మైనార్టీ సంయుక్త కార్యదర్శి షేక్ నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిలను పరామర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు

గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్, సహాయ కార్యదర్శి కోరంగి సీతారాం, గిరిజన జాగృతి నాయకులు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణ మూర్తి డిమాండ్ చేశారు. వరస మరణాలు జరిగిన సంఘటన నేపథ్యంలో బుధవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు మృతికి మరియు అనారోగ్యం గల కారణాలను ప్రిన్సిపల్ అనురాధ, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కురుపాం సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యమందిస్తానని, హెల్త్ వాలంటర్లను నియమిస్తానని అధికారంలో రాగానే గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి మొదటి సంతకం ఏమైందని ప్రశ్నించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక చాలీచాలని గదుల్లో విద్యార్థులు 16 రూముల్లో 600 మంది విద్యార్థులు ఎల ఉంటారని ప్రశ్నించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా పాడేరులో ముఖ్యమంత్రి మరో జన్మ ఉంటే ఆదివాసీగా జన్మిస్తానని చెప్పిన వ్యక్తి నేడు విద్యార్థులు మరణిస్తే ఎలా జన్మిస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, హాస్పిటల్‌లో ఉన్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి వారందరికీ హెల్త్ చెకప్ లు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సీతారాం మాట్లాడుతూ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

గిరిజన మంత్రి తొలి సంతకం హామీ ఏమైంది

మన్యం జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలు సంభవిస్తుంటే ఆరోగ్య కార్యకర్తల నియామకంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తొలి సంతకం హామీ నేటికీ నెరవేరలేదు. ప్రభుత్వ పథకాలకు ఇస్తున్న ప్రాధాన్యత విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ఇవ్వడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తల నియామకంలో మంత్రి చేసిన తొలి సంతకం హామీని నిలబెట్టుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘాలు

చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న పుష్పశ్రీవాణి

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే

పార్వతీపురం: మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత పది రోజుల్లో ముగ్గురు గిరిజన విద్యార్థులు మరణించారని తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ఎఎన్ఎంల నియామకం హామీ కొండెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్వతీపురం ఐటిడిఎకు రెగ్యులర్ పిఒ, డి డి లేరని, పర్యవేక్షణ పూర్తిగా కొరవ డిందని అన్నారు. కనీసం పరా మర్శిం చటం, పరి హారం ఇవ్వడం లేదని అన్నా రు. మృతి చెందిన గిరి జన విద్యా ర్థుల కుటుం బా లకు రూ.5 లక్షలు చొప్పున పరి హారం ఇవ్వా లని, ఉద్యో గాలు ఇవ్వా లని రంజిత్ కుమా ర్ డిమాండ్ చేశారు.

మన్యంలో ప్రభుత్వ వైద్య సేవలు బంద్

- **పిహెచ్‌సి వైద్యుల సమ్మె ఫలితం**
- **అరకొర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమ్మె నేపథ్యంలో మన్యం జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలు నిలిచిపోయాయి. బుధవారం నుంచి పిహెచ్‌సిల వైద్యులు విధులకు హాజరు కావడం లేదు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. జిల్లాలో 37 పిహెచ్‌సిలు ఉండగా, వీటిలో 67 మంది వైద్యులు పని చేస్తున్నారు. వీరంతా సమ్మెలోకి వెళ్లడంతో గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో గల పిహెచ్‌సిల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. తమ డిమాండ్ల సాధన కోసం వైద్యులు గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు సిద్ధమయ్యారు. పిజి కోటాను 15 నుంచి 20శాతానికి పెంచాలని, ఏజెన్సీ అలవెన్సులు మంజూరు చేయాలని, ప్రమోషన్ కల్పించాలని, సంచార చికిత్స అలవెన్సు కింద రూ.5వేలు చెల్లించాలని వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం వైద్యుల సంఘం నాయకులతో చర్చలు జరిపినా డిమాండ్లలో ఒకదాన్ని కూడా ఆమోదానికి నిరాకరించడంతో వైద్యులు సమ్మెకు దిగారు. దీని కారణంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలు అందే అవకాశం లేదు. ప్రభుత్వం పంతానికి పోయి వైద్యుల డిమాండ్లపై మొండివైఖరి అవలంభిస్తోంది.

అరకొర ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రయోజనమెలా?

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమ్మె నేపథ్యంలో మన్యం జిల్లాలో గల అన్ని పిహెచ్‌సిల్లో అరకొర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దష్టి సారించింది. వైద్యులు సమ్మెకు వెళ్ళడంతో జిల్లా అధికారులు ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులను, ఆయుష్ విభాగంలో ఉన్న వైద్యులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా పంపించారు. అయితే బుధవారం మారుమూల ఏజెన్సీ ప్రాంత పిహెచ్‌సిలకు వైద్యుల్లేని పరిస్థితి కనిపించింది. కురుపాం మండలం నీలకంఠాపురం పిహెచ్‌సికి ప్రత్యామ్నాయ వైద్యుడు వెళ్ళలేదు. తాడికొండ పిహెచ్‌సికి ఒక వైద్యుడు వెళ్లి గంటపాటు వున్నారు. కొన్ని పిహెచ్‌సిలకు ఆయుర్వేద, హెూమియో వైద్యులను కూడా జిల్లా అధికారులు పంపించారు. అల్లోపతి వైద్యం చేయాల్సిన ఆసుపత్రుల్లో ఆయుష్ వైద్యులు ఎలా సేవలు అందిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. గురువారం దసరా తర్వాత వైద్యుల సమ్మె తీవ్ర రూపం దాల్చనుంది. పిహెచ్‌సి వైద్యుల సమ్మెకు మద్దతు గా ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆయుష్ వైద్యులు మద్దతు పలికే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో గ్రామాల్లో, ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలు పూర్తిగా స్తంభించిపోయే అవకాశం ఉంది.



వైద్యుల సమ్మెతో పిహెచ్‌సిలో ఖాళీగా ఉన్న కుర్చీలు

వైద్యుల నిరసన దీక్షలకు సిఐటియు మద్దతు

వైద్యులకు సంఘీభావంగా దీక్షల్లో పాల్గొన్న సిఐటియు నాయకులు

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ ఎదుట పిహెచ్‌సి వైద్యుల సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన నిరసన దీక్షలకు సిఐటియు మద్దతు తెలిపింది. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ గత ఏడాదిగా అనేక దశల్లో ప్రభుత్వానికి తమ సమస్యలు పరిష్కరించాలని వైద్యులు వినతులు అందజేసినప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యమందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న వైద్యుల పట్ల ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఉన్నతమైన చదువులు చదువుకొని సేవ దృక్పథంతో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించాలని, ఉన్నత చదువులకు అవకాశం కల్పించకుండా, ప్రస్తుతం ఉన్న 20శాతం కోటాను 15 శాతానికి తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లాలో సుమారు 20మంది వైద్యుల కొరత ఉందని, తక్షణమే వైద్యుల ఖాళీలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చెల్లించాల్సిన అలవెన్స్‌లు, టిఎ, డిఎ బకాయిలు, ఇంక్రిమెంట్లు తక్షణమే చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఈనెల 3 నుంచి చేపట్టనున్న సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కన్వీనర్ బి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0తో మేలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

వ్యవసాయ రంగానికి మేలు చేసేలా ప్రవేశపెట్టిన జీఎస్టీ - 2.0 పన్ను తగ్గింపుపై రైతులకు అర్థమయ్యేలా కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయానికి సంబంధించిన జిఎస్టి- 2.0 ప్రచారం కరపత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాక్టర్లు, టైర్లు, విడిభాగాలు, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు, డ్రోన్లు, జీవ సంబంధమైన పురుగు మందులపై 18,12 నుండి 5 శాతం వరకు జీఎస్టీ తగ్గింపు, ట్రాక్టర్ విడిభాగాలకు 18 నుండి 5 శాతం వరకు తగ్గింపు, వ్యవసాయ, అనుబంధ మత్స్య , పశు సంవర్ధక తదితర రంగాలలోని తయారీకి, వాటి ఉత్పత్తులు, ఉప ఉత్పతుల్లో 837 వస్తువులకు 12 నుండి 5 శాతం వరకు తగ్గింపు, సెప్టెంబర్ 22 దాటిన తర్వాత నుంచి నూతన జీఎస్టీ పన్ను విధానం అమలు తగ్గింపుతో సన్న ,చిన్న కారు రైతులకు భారీ ఊరట లభిస్తుందని, తద్వారా రైతులకు కొనుగోలు శక్తి పెరుగుతుంది. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయధికారి కె.రాబర్ట్ పాల్, జిఎస్‌టి నోడల్ ఆఫీసర్ డేవిడ్ పాల్గొన్నారు.

మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

నూతన కలెక్టర్ కార్యాలయ నిర్మాణ స్థల పరిశీలన

పార్వతీపురం : కొత్త సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి బుధవారం అడ్డాపుశిలలో పరిశీలించారు. పట్టణం శివారులోని అడ్డాపుశిల వద్ద 59.80 ఎకరాల్లో కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి స్థలాన్ని గతంలో ప్రతిపాదించారు. ఆ స్థలాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, అనుకూల పరిస్థితులను పరిశీలించారు. జిల్లా ఏర్పాటుకు ముందు గత జిల్లా యంత్రాంగం కూడా భవన నిర్మాణానికి ఈ స్థలాన్ని ప్రతిపాదించిన సంగతి విదితమే. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌రెడ్డి, స్థానిక తహశీల్దార్ సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి

- **రూ.2 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి**
- **విశాఖలో టిసిఎస్, కాగ్నిజెంట్, గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు**
- **ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/దత్తిరాజేరు

ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో అభివద్ధి చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు, విశాఖలో రాబోయే ప్రపంచ స్థాయి పరిశ్రమలు, విజయనగరం, పార్వతీపురం జిల్లాల పరిధిలోని గిరిజన కేంద్రీయ విద్యాలయం ఇందుకు ఎంతో తోడ్పడతాయని అన్నారు. వీటికితోడు రూ.2వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, నదులు అనుసంధానం చేస్తామని చెప్పారు. గత పాలకుల వల్ల భోగాపురం ఎయిర్ పోర్టు ఆలస్యమైందని విమర్శించారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని దత్తిరాజేరు మండలం దత్తి గ్రామానికి ఆయన బుధవారం వచ్చారు. పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేశారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న పొంతూరు అప్పలరాజుకు, ఆయన తల్లికి పింఛను అందజేశారు. అనంతరం ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రాలోని వంశధార, నాగావళి, చంపావతి, వేగావతి తదితర నదులు అనుసంధానం చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తిచేసి గోదావరి నుంచి వంశధారకు అనుసంధానం చేయడం ద్వారా నీటి ఎద్దడి తీరుతుందని అన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో అత్యంత కీలకంగావున్న తోటపల్లి ప్రాజెక్టు పనులు తమ హయాంలోనే పూర్తయ్యాయని, రామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు కూడా తామే ప్రారంభించామని అన్నారు. వచ్చే రెండేళ్లలో ఉత్తరాంధ్రలోని పెండింగ్ ప్రాజెక్టులకు రూ.2వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు పూర్తిచేస్తామన్నారు. అటు విశాఖ నగరానికి టిసిఎస్, కాగ్నిజెంట్, గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయని, ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయని తెలిపారు. రూ. కోటీ 47 లక్షలతో ఆర్‌సిఆర్ మిటల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటవుతోందన్నారు. విశాఖ, రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవేతో దేశమంతటా రవాణాకు కనెక్టివిటీ మెరుగవుతుందని సిఎం చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, సామాజిక భద్రతలో భాగంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం పేదల గౌరవాన్ని పెంచిందన్నారు. జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పథకం క్రింద 2,75,681 మందికి సుమారు 116.95 కోట్ల రూపాయలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రతి నెల ఒకటవ తేదీనే 95శాతం మందికి పెన్షన్లను అందజేస్తున్నామన్నారు. భోగాపురం విమానాశ్రయం జిల్లాకు గ్రోత్ ఇంజన్ గా మారే అవకాశం ఉందని, ఇది పూర్తయితే అభివృద్ధి వేగం పెరుగుతుందని అన్నారు. పర్యాటకం, సేవా రంగంలో అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఎక్కువ ఉన్నాయనీ కలెక్టర్ వివరించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, తమ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులను కేటాయించనున్నట్లు ప్రకటించారు. మూడో సంతానంగా ఆడబిడ్డ పుడితే రూ.50వేలు మగ పిల్లవాడు పుడితే ఆవు దూడ ఇస్తామని తాము గతంలో ప్రకటించామని, రెండో విడత త్వరలోనే అమలు చేయనున్నామని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ సిఇఒ వాకాటి కరుణ, మార్గదర్శకులు బంగారు కుటుంబాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

సిఎం చంద్రబాబుకు దత్తి గ్రామంలో ఘన స్వాగతం లభించింది. దత్తిలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు బుధవారం మధ్యాహ్నం 12.02 గంటలకు సిఎం చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, సూక్ష్మ, చిన్న, పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్, జెసి ఎస్.సేతుమాధవన్ తదితరులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, గాదె శ్రీనివాసులు నాయుడు, కావలి గ్రీష్మ, ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, కోండ్రు మురళీమోహన్, కోళ్ల లలితకుమారి, అతిథి విజయలక్ష్మి గజపతిరాజు, ఆర్‌విఎస్‌కెకె రంగారావు (బేబినాయన) లోకం నాగమాధవి, బోనెల విజయచంద్ర, ఎన్.ఈశ్వరరావు.. సిఎంకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

మీటింగ్ కావాలా? ఫొటో కావాలా?

ప్రజాశక్తి - దత్తిరాజేరు

'మీకు మీటింగ్ కావాలా? నాతో ఫొటో కావాలా..! మీకు ఏది కావాలంటే అదే, ఎందుకంటే వాతావరణం బాగోలేదు. సమయం కూడా తక్కువ ఉంది... మీరే తేల్చుకోండి అన్నారట ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు... అయితే., ఫోటోనే కావాలన్నారట ఎక్కువ మంది తెలుగు తమ్ముళ్లు...!

దత్తిరాజేరు మండలం దత్తిలో పింఛన్ల పంపిణీకి వచ్చిన చంద్రబాబు గజపతినగరం నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనుకున్న సమయానికి పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక కార్యక్రమం పూర్తికాకపోవడంతో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని పావుగంటలోనే ముగించి, మిగిలిన ముప్పావుగంటపాటూ వచ్చిన తమ్ములతో ఫోలు దిగేశారట. ఆ పావుగంట సమావేశంలోనూ పార్టీ బలోపేతానికి అందరూ కృషిచేయాలని బాబు సూచించినట్టుగా సమాచారం. 'ఎవరు ఎంతమేర పనిచేస్తున్నారో నాకు అంతా తెలుసు.... నా వద్ద సమాచారం ఉంది. కష్టపడినవారికి గుర్తింపు ఉంటుంది' అంటూ పైపైన షోయింగ్ చేస్తున్న నాయకులకు పరోక్షంగా చురకలు అంటాచారట. ఇటు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు కూడా దిశానిర్ధేశం చేసినట్టుగా సమాచారం. నియోజకవర్గంలో పార్టీ అంతర్గత సమస్యలు ఎక్కువగానే ఉన్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని బాబు సూచించారట. కార్యకర్తలు చెప్పిన విషయాలను అలక్ష్యం చేస్తే అనైక్యతకు దారితీస్తుందని హితబోద చేసినట్టుగా బోగట్టా. అంతకు ముందు ప్రజావేదికపై బాబు ప్రసంగిస్తూ మంత్రి శ్రీనివాస్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. ఇంకా ఎక్కువ సమయం కేటాయించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని కూడా అనంతరం సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరితోనూ చంద్రబాబు చకాచక్కా సెల్ఫీ దిగి విజయవాడ పయనమయ్యారని సమాచారం.

పోగొట్టుకున్న నగదును అందజేస్తున్న అధికారులు

ఆర్‌టిసి ఉద్యోగుల నిజాయితీ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో రాజాం మండలం మెంటిపేట గ్రామానికి చెందిన మారం కేశవరావు బస్సు ఎక్కుతుండగా, ఆయనతో పాటు తెచ్చుకున్న రూ.50వేల నాణేల రెండు మూటలు తాను కూర్చున్న కుర్చీలో మరిచిపోయి వెళ్లిపోయాడు. కాంప్లెక్స్‌లో ఆన్ డ్యూటీలో ఉన్న కంట్రోలర్ వాటిని చూసి డిపో సెక్యూరిటీకి అప్పజెప్పారు. బాధితుడు మరిచిపోయిన నాణేల మూటల కోసం వాకాబు చేయగా, ఆర్టీసీ సెక్యూరిటీ వారి సమక్షంలో వాటిని భద్రంగా ఉంచినట్టు తెలిపారు. బుధవారం డిపోకు వచ్చి జరిగిన విషయం చెప్పడంతో డిపో మేనేజర్ పట్నాన వెంకటేశ్వరరావు సమక్షంలో సెక్యూరిటీ ఆధ్వర్యంలో సెక్యూరిటీ ఇన్చార్జి బి.ఉమామహేశ్వరరావు, సెక్యూరిటీ గార్డు టి.రాము రూ.50వేల రెండు నాణేల మూటలను అందజేశారు. ఈ సందర్భంగా పోగొట్టుకున్న మారం కేశవరావు ఆర్టీసీ ఉద్యోగుల నిజాయితీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మేరా యువభారత్ పార్వతీపురం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో బుధవారం నిర్వహించారు. ముందుగా వృద్ధులను వారి వారి కుటుంబసభ్యులతో చరవాణి ద్వారా మాట్లాడించారు. వారి అనుభవాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా వారి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలపై వివరించారు. అదేవిధంగా వృద్ధుల స్థానిక, ప్రపంచ వర్ధులకు పోరుకుల మా ఆకాంక్షలు, మా శ్రేయస్సు, మా హక్కులు ఈ సంవత్సరం వృద్ధుల దినోత్సవం ప్రత్యేకతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం వృద్ధులకు మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ జానీ, గణేష్, సామాజిక కార్యకర్త ఆకుల శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాంసం విక్రయాలు జరిపితే చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ఈ నెల 2న గాంధీ జయంతి సందర్భంగా ఎవరైనా మాంసం విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని స్థానిక మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు విక్రయదారులను హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని మాంసం విక్రయ షాపుల వద్దకు వెళ్లి వ్యాపారస్తులను హెచ్చరించడంతోపాటు నోటీసులు కూడా అందజేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలంలో ఇటీవల అనారోగ్యం కారణాల రీత్యా మృతి చెందిన కార్యకర్తల కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి బుధవారం పరామర్శించారు. పిప్పలభద్ర, పెదబుడ్డిడి గ్రామాల్లో పర్యటించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మండల కన్వీనర్, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న పుష్పశ్రీవాణి

దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

దసరా ఉత్సవాల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

97శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో 31 సచివాలయాల పరిధిలోని 53 పంచాయతీల్లో బుధవారం 7,927 పింఛన్లకు గాను 7,725 పింఛన్లు పంపిణీ చేశామని ఎంపిడిఒ బీబీ మిశ్రో తెలిపారు. మొత్తం 97.45 శాతం పింఛన్లు అందించినట్లు తెలిపారు. ఇప్పటికే మన్యం జిల్లాలో మొదటి స్థానంలో తాము ఉన్నట్లు వెల్లడించారు.

150 లీటర్ల సారా ధ్వంసం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మన్యం జిల్లాకు సరిహద్దు రాష్ట్రమైన ఒడిశా గ్రామాల్లో బుధవారం జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఒడిశాఖ ఎక్సైజ్ అధికారుల సహకారంతో వివిధ గ్రామాల్లో దాడులు నిర్వహించి 150 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. 9బృందాలుగా ఏర్పడి ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో జయకోట, బొత్తరాపల్లి, మూలకర్లి, విక్రంపురం గ్రామాల్లో దాడులు నిర్వహించి, 8200 లీటర్ల బెల్లపు ఊటను, 150 లీటర్ల సారా ధ్వంసం చేశారు.

బురదమయమైన రోడ్డు

ఇలా ఉంటే వెళ్లేదెలా..?

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక వ్యవసాయ కార్యాలయం, చెత్త సంపద కేంద్రం, పశువుల ఆసుపత్రి వంటి కార్యాలయాలకు వెళ్ళేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిసారీ వర్షం పడితే రహదారులు బురద మయంగా మారడంతో ఇలా ఉంటే ఎలా వెళ్ళేది అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

7న చలో విజయవాడ : ఫ్యాప్టో

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్య రంగం ఆర్థిక సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో సంఘ నాయకులు బుధవారం ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను తక్షణమే చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని, సరెండర్ లీవ్ బకాయి తక్షణమే చెల్లించాలని, డిమాండ్ చేశారు. విజయవాడలో జరుగు కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొవాలని పిలుపునిచ్చారు.

3 నుంచి రీసర్వే : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 3 నుంచి జిల్లాలో 43 గ్రామాల్లో 60 రోజులు రీసర్వే నిర్వహించనున్నట్టు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. సర్వే పూర్తి చేసేందుకు గానూ వివిధ సర్వే బృందాలు వేస్తున్నట్టు తెలిపారు. నిర్దేశించిన సమయపాలనలో పూర్తి చేయడానికి రీసర్వే కార్యకలాపాలను క్రమబద్ధీకరిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా సంబంధిత రీసర్వే గ్రామానికి చెందిన గ్రామ సర్వేయర్, విఆర్ఒ కమ్యూనికేషన్ బృందంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయి పనికి కూడా హాజరు కావాలని సూచించారు. కమ్యూనికేషన్ బృందం నోటీసును భూ యజమానులకు, వాటాదారులకు అందజేయాలన్నారు. వీటితో పాటు మరిన్ని వివరాలను సిబ్బందికి సూచించారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తుందని రాష్ట్ర గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కూర్మరాజుపేటలో బుధవారం చేపట్టిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ చేరేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని ఉల్లిభద్రలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు కలెక్టర్ పింఛన్లు అందించారు. పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజల స్పందనను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 1,40,066 మందికి రూ.60 కోట్లు ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, ఇతర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

సాలూరు: వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కుక్కిడి పంచాయతీ పరిధిలో నిగరాంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి పింఛనుదారుల ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులుగా ఉన్నవారు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపిడిఒ, పంచాయతీ కార్యద ర్శులకు ఎమ్మెల్యే సూచించారు. సమస్యలపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతి అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కుక్కిడి సర్పంచ్ బిడ్డిక రాజారావు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎన్ శేఖరం, పంచాయతీ కార్యదర్శి ఆరిక హేమ భార్గవి, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : స్థానిక జిల్లాఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కిడ్నీ బాధితులకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పెన్షన్‌ను అందజేశారు. అనంతరం పట్టణంలోని 21వ వార్డులో పలువురు వృద్ధులు, వికలాంగులకు, వితంత వులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీలు, వార్డ్ కౌన్సిలరు బడే గౌరినాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో గల గాంధీనగర్, సీతంపేట గ్రామాల్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్రదేవ్ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోనే రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన మండల కన్వీనర్లు కేవీ కొండయ్య, ఎన్. వంశీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'మోర్ బజార్'లో కాలంచెల్లిన సరుకులు

ప్రజాశక్తి - పాలకొండ

వినియోగదారులకు నాణ్యమైన సరుకులు అందించాల్సి ఉన్నప్పటికీ మోసాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలో నెలకొల్పిన మోర్ బజార్‌లో గడువు తీరిన సరుకులను విక్రయిస్తున్నట్లు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ మార్కెట్లో పాలు, పెరుగు నుండి నిత్యవసర సరుకులు వరకు గడువు తేదీన సరుకులు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. వీటిపై పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో మార్కెట్లో కాలం చెల్లిన వస్తువులు బహిరంగంగా విక్రయించడంతో పట్ల సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సదరు బజార్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదమని తెలిసినా.. తవ్వేశారు!

◆కోతకు గురవుతున్న సిసి రోడ్డు ◆ఆందోళన చెందుతున్న వాహనదారులు

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువ ప్రధాన రహదారి అంచున మురుగునీరు మళ్లింపునకు చేపట్టిన కాలువ తవ్వకం కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న చందంగా తయారయ్యిందని వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే, ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని భయపడిపోతున్నారు. రహదారి నిబంధనకు విరుద్ధంగా చేపట్టే ఈ కాలువ తవ్వకంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ తవ్వకం వల్ల గతంలో ఆర్ అండ్ బి లక్షలాది రూపాయలు వెచ్చించి రెండు పొరలుగా నిర్మించిన సిసి రహదారి నీటి ప్రవాహంతో కోతకు గురవుతోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రహదారి నిర్మాణాలు చేపట్టేటప్పుడు కోతకు గురికాకుండా ఉండేందుకు ఇరువైపులా సుమారు ఒక మీటర్ వరకు షోల్డర్లు నిర్మించాలన్న నిబంధన ఉంది. ఈ విధమైన నిబంధనను పక్కనపెట్టి రహదారి అంచున నీటి ప్రవాహానికి కాలువ తవ్వడం అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతుంది. పంచాయతీ అధికారులు చేపట్టిన ఈ అనాలోచిత తవ్వకం వల్ల ప్రజలకు, వాహనదారులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే ప్రధాన రహదారి సక్రమంగా లేకపోవడంతో ప్రజల అవస్థలు పడుతున్నప్పటికీ అధికారులు ఇలా తవ్వకం చేపట్టడం దారుణమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో రహదారి నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నామని గతంలో మంత్రి సంధ్యారాణి ప్రకటించినప్పటికీ ఆ రకంగా ఇంకా కార్యరూపం దాల్చే పరిస్థితులు కనిపించలేదు. కొత్త రహదారి పరిస్థితి దేవుడు ఎరుగని, ఇప్పుడున్న రహదారి పాడవ్వకుండా ఉంటే కొంతైనా మేలని మండల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి కోతకు గురి కాకుండా పూర్తిస్థాయిలో కాలును పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న కాలువ, రోడ్డు

ప్రవేశాలకు సర్టిఫికెట్ అవసరం లేదు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతి విద్యార్థి డిగ్రీ పూర్తి చేయాలని, డిగ్రీ లేకుండా ఎవరూ ఉండకూడదని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. అడ్మిషన్ల కోసం ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదని, అపార్ ఐడీ, పెర్మనెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ ఉంటేచాలని తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో డ్రాపౌట్స్ ఉండరాదని, బాల్య వివాహాల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. బడిమానేసిన పిల్లల జాబితాను సిద్ధం చేసుకొని, వారు ఏమి చేస్తున్నారో తెలుసుకొని వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి మళ్లీ చేర్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండేలా సదుపాయాలు కల్పించాలని అన్నారు. 5 నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు ఉండాలని, అలాగే ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం వచ్చేలా భోదనా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డిఇఒ బి.రాజకుమార్, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు, ఎస్ఎస్ఎ ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, ఎంఇఒలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

జిఎస్‌టి తగ్గింపుతో ఆదా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిఎస్‌టి తగ్గింపుతో ప్రతి కుటుంబానికి రూ.15వేలు వరకూ ఆదా అవుతుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కుక్కిడి పంచాయతీ నిగరాం గ్రామంలో బుధవారం ఆమె ప్రజలకు జిఎస్‌టి సంస్క రణలను గురించి వివరించారు. పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ఎన్‌డిఎ ప్రభుత్వం జిఎస్‌టి తగ్గింపు ద్వారా ఇచ్చిందని అన్నారు. కిరాణా సామాగ్రి 13 శాతం, దుస్తులు, పాదరక్షలు 7 శాతం, రోజువారి నిత్యవసరాలు 13 శాతం, మందులు 7 నుండి 12 శాతం, ఆరోగ్యం, జీవిత బీమా 18 శాతం, స్టేషనరీ 7 శాతం వరకు పొదుపు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, ఎఎంసి చైర్పర్సన్ కడ్రక కళావతి, ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎన్ శేఖరం, నాయకులు బిడ్డిక పద్మావతి, కడ్రక అప్పలస్వామి పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే

రైతులకు టార్పాలిన్లు పంపిణీ

ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు అనూప్, శంకరావు, రవి భట్లు, ప్రోగ్రాం కోర్డినేటర్ సూర్యం, షుగ్రీవులు తిరుపతిరావు, పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని చినబోగిలి రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం జిఎస్‌టి సంస్కరణపైన రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ఎస్.అవినాష్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు ధరలు 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుర్మాణ రాధా శ్రీనివాస్ రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ చోరీతో బిజెపి గెలిచింది : కాంగ్రెస్

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

కేంద్రంలోని నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహసించేలా ప్రజల ఓట్లను దోచుకుని ముచ్చటగా మూడోసారి గద్దెనెక్కిందని, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడి, లేని ఓట్లను ఉన్నట్లుగా చూపించి, ఉన్న ఓట్లను తొలగించి, బిజెపి ఓట్ చోరీకి పాల్పడిందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిజమైన ఓటర్లు వారికి నచ్చిన నాయకులను ఎన్నుకునే అధికారాన్ని కోల్పోయారన్నారు. ఈ నేపథ్యంలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఓటర్ల జాబితా అవకతవకలపై దేశవ్యాప్త ఉద్యమానికి పూనుకుందని అన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 15 వరకు ఎపిలో సైతం పిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంతకాల సేకరణ చేపట్టనుందన్నారు. ఈ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ మేధావులు, విద్యావంతులు, ప్రజాస్వామ్యవాదులు వెరసి అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా తమతో కలసి పోరాటం చేయాలని స్థానిక ప్రజలకు చిన్నారావు పిలుపునిచ్చారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పత్తిక లక్ష్మయ్య, కిల్లక లక్ష్మయ్య, ఆరిక ధర్మారావు, యువజన విభాగం నాయకుడు కోలక జయరాం, మహిళా విభాగం నాయకులు నిమ్మక పెంటమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నష్టపరిహారాన్ని సత్వరమే అందించేలా చర్యలు

డిఎఫ్ఒను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఏనుగులు ధ్వంసం చేసిన పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారాన్ని సత్వరమే అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి డిఎఫ్ఒ జివిపి ప్రసూనను ఆదేశించారు. పార్వతీపురం మండలం మరికి కృష్ణపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఏనుగుల గుంపు తమ పంట పొలాల్లోకి చొరబడి తాము సాగుచేసుకుంటున్న పంటలను ధ్వంసం చేస్తున్నాయని బుధవారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. తాము సాగుచేస్తున్న వరి, జొన్న, వెదురు గల సుమారు 50 ఎకరాల్లోని పంటలను ధ్వంసం చేశాయని, దీంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కావున నష్టపోయిన పంటలకు గాను సంబంధిత రైతులు, కౌలు రైతులకు నష్టపరిహారాన్ని అందించి తమను ఆదుకోవాలని జిల్లా కలెక్టరుకు దరఖాస్తును అందజేశారు. దరఖాస్తు పరిశీలించిన కలెక్టర్ వెంటనే స్పందించి, జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అందజేయాలని, అలాగే నష్టపోయిన గిరిజన రైతులకు త్వరగా నష్టపరిహారం అందించేలా సత్వర చర్యలు చేపట్టాలని డిఎఫ్ఒను ఆదేశించారు. అలాగే ఏనుగుల విడిది కోసం చేపట్టిన తాత్కాలిక విశ్రాంతి కేంద్రం పనులను పరిశీలించి, వేగవంత మయ్యేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీంతో రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు.

గురుకులాన్ని సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు అనారోగ్యానికి గురైన విషక్ష్యం తెలుసుకున్న డిఎంహెచ్ఒ ఎస్.ఎస్.భాస్కర రావు బుధవారం సాయంత్రం ఆ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల డైనింగ్ రూమ్, ఆర్ఒ ప్లాంట్ పరిశీలించారు. ప్రిన్సిపాల్ పి.అనూరాధ మాట్లాడుతూ రెండునెలలుగా ఆర్ఒ ప్లాంట్ పనిచేయకపోవడంతో వేడి నీరు పిల్లలకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సంద ర్భంగా డీఎంఅండ్‌హెచ్ఒ భాస్కరరావు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 611 మంది విద్యార్థులకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాలువారిగా గుర్తించి వారి ఇళ్లకు ఎఎన్ఎం, ఆశావర్కర్లు పంపించి వారి ఆరోగ్య పరిస్థితులు సేకరించామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కురుపాం, భద్రగిరి, చినమేరంగి సీహెచ్సీలు వైద్య పరీక్షలు నిర్వ హించి, వైద్య సేవలు అందిస్తున్నమని తెలిపారు. మెరుగైన వైద్య సేవలు కోసం జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

జిఒ నెంబర్ 3 ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గిరిజనులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ ఫెడరేషన్ నాయకులు బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించరాదని అన్నారు. జీవో నెంబర్ 342 ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు స్టడీ లీవ్‌ను, ఆయా విద్యా సంవత్సరంలోనే వారికి శిక్షణ అవకాశాలు కల్పించి వారికి పదున్నతగా దోహదపడే విధంగా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 2025-2026 పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు తెలుగు లేదా ఇంగ్లీష్ మీడియంలో రాయడానికి సరైన ఆప్షన్ ఎంపిక చేసుకునే వెసులుబాటు విద్యార్థులకు కల్పించాలని డిమాండ్ చేశారు. 11వ పిఆర్‌సి బకాయిలు నాలుగు విడతల డిఎ బకాయిలు విడుదల చేయాలని, జిపిఎఫ్ పిఎఫ్ సరెండర్ లీవ్‌లకు సంబంధించిన నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి సత్యనారాయణ రెడ్డి, అన్ను వెంకట్రావు, పి.అనిల్, డి. సుందర్రావు, ఆర్ ప్రసాద్, డి రాజు, పి పుష్పనాదం, జంపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతినిస్తున్న ఉపాధ్యాయులు

సంతలకు 'దసరా' కళ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నేడు జరగనున్న దసరా పండగ సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో బుధవారం నిర్వహించిన గిరిజన వారపు సంతకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి కొనుగోలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దసరా పండగ సంతకు సంక్రాంతి కళ ఉట్టి పడింది. పువ్వులు, నిమ్మకాయలు, కొత్త బట్టలు, వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేశారు. వ్యాపారులు పెద్ద ఎత్తున అమ్మకాలు చేపట్టారు.

గుమ్మలక్ష్మీపురం: సందడిగా ఉన్న సంత

వీరఘట్టం: సంతలో కొనుగోలు చేస్తున్న జనం

వీరఘట్టం: దసరా పండగ సందర్భంగా నూతన వస్త్రాలు, వాహనాలకు పూజించేందుకు వివిధ రకాల సామాగ్రిని కొనుగోలు చేసేందుకు మండల నలుమూల నుండి ప్రజలు అధిక సంఖ్యలో చేరుకోవడంతో కొనుగోల దారులతో వీరఘట్టంలోని మార్కెట్ కిటకిటలాడింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉండేందుకు పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

పేరుకుపోతున్న సమస్యలు.. పట్టించుకోని పాలకవర్గం

పరిష్కరించాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో పేదలు నివాసాల మధ్య సమస్యలు పెరిగిపోతున్నా పాలకవర్గం గానీ, ప్రభుత్వం గానీ కనీసం పట్టించుకొనే పరిస్థితి లేదని సిపిఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఎం ప్రతినిధి బృందం పట్టణంలోని 6,7,8 వార్డుల్లో, పార్కుల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంది. అనంతరం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ 6,7 వార్డుల పరిధిలో గల శివాజీ బొమ్మ నుంచి దిగువ వరకు, అలాగే ఎన్టీఆర్ బొమ్మ నుండి దాసరి వీధి వరకు కాలువ రోడ్ల అనుసంధానం బాగోలేదన్నారు. దీనివల్ల పెద్ద వర్షాలకు వేణుగోపాలస్వామి వీధి జంక్షన్ వద్ద మురికి నీరు, వర్షం నీరు కాలువ గుండా వెళ్లకుండా రోడ్డు మీదకు పొంగి పొర్లుతుందన్నారు. పై నుండి వచ్చే వరదతో పాటు వేణుగోపాలస్వామి వీధి కాలువలు నిండిపోయి ఉన్నాయని, తక్షణమే ఆ ఇసుక మేటలను జెసిబిలతో పూడిక తీయించాలని డిమాండ్ చేశారు. అలాగే పట్టణ ప్రజల అవసరాలు తీర్చే మున్సిపల్ కార్మికులకు తాగడానికి సరైన నీటి సౌకర్యాల్లేవని, ఉదయం నుండి సాయంత్రం వరకు పట్టణ ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పనులు చేసుకొని ఇంటికి వచ్చే కార్మికులకు తమ అవసరాలకు సరిపడే తాగునీరందడడం లేదని, చివరిగా వచ్చే మురుకు నీరే తాగునీరుగా వాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించి కుళాయి నీరు వచ్చేలా చేయాలని మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. రాజేశ్వరరావు పార్కు, బంగారమ్మ కాలనీ పార్కు, రైతు బజారు, గాంధీ పార్కు పిచ్చి మొక్కలతో నిండి ఉందని, అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమని తెలిపారు. మున్సిపల్ పరిధిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే ప్రభుత్వం, పాలకవర్గం స్పందించి, కార్మిక వాడల్లో కాలువలకు, మంచినీటికి, నిధులు కేటాయించి, పేదల అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో ప్రజలందర్నీ కలుపుకొని ఆందోళనకు సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ నివాస ప్రాంతాల నాయకులు విజయ్, రాణి, స్వప్న, వెంకటరమణ, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఎన్వై నాయుడు